క్లుప్తంగా

బాధ్యతలు స్వీకరించిన తహసీల్దార్



తహసీల్దార్ చిన్నికృష్ణ

సబ్బవరం : సబ్బవరం తహసీల్దార్‌గా బి.చిన్నికృష్ణ శనివారం బాధ్యతలు స్వీకరించారు. ఆయన అల్లూరి సీతారామరాజు జిల్లా పాడేరు కలెక్టరేట్‌లో సూపరింటెండెంట్‌గా పనిచేసి ఇక్కడకు బదిలీపై వచ్చారు. గతంలో ఇక్కడ తహసీల్దార్‌గా పనిచేసిన బి.సత్యనారాయణ పదవీ విరమణ చేశారు. అనంతరం ఎన్నికల విధుల్లో భాగంగా ఇక్కడకు వచ్చిన జె.చలమయ్య అనారోగ్యంతో బాధపడుతూ మృతి చెందారు. ప్రస్తుతం ఇక్కడకు సాధారణ బదిలీల్లో భాగంగా సబ్బవరం వచ్చిన డిప్యూటీ తహసీల్దార్ అప్పారావు ఇన్‌చార్జి తహసీల్దార్‌గా విధులు నిర్వహిస్తున్నారు.

శిల్పారామంలో ముగిసిన సంబరాలు



శిల్పారామంలో కూచిపూడి నృత్య ప్రదర్శనలో కళాకారులు

పీఎం పాలెం: శిల్పారామంలో కొద్ది రోజులుగా జరుగుతున్న దసరా సంబరాలు శనివారంతో ముగిశాయి. ముగింపు ఉత్సవాలలో భాగంగా ఆ రోజు సాయంత్రం 6 గంటలకు ప్రదర్శించిన కూచిపూడి నృత్యం ప్రేక్షకులను అలరించింది. నగరానికి చెందిన నృత్యభారతి డ్యాన్స్ అకాడమీలో శిక్షణ పొందుతున్న చిన్నారులు అద్భుతంగా శాస్త్రీయ నృత్యం ప్రదర్శించి, ప్రేక్షకులను ఆకట్టుకున్నారు. కనక మహాలక్ష్మి నృత్య దర్శకత్వంలో కళాకారులు లీలాప్రియ, వేదశ్రీ, నవ్యశ్రీ, సావిత్రి, కుశ్మిత తదితరులు పాల్గొన్నారు.

ఆలయ స్థలాన్ని కాపాడాలని ఆందోళన



ఆలయానికి చెందిన స్థలాన్ని కాపాడాలని కోరుతూ ఆందోళన చేస్తున్న యువత

అగనంపూడి: జీవీఎంసీ 85వ వార్డు కొండయ్యవలస గ్రామదేవత బంగారమ్మ ఆలయానికి చెందిన స్థలాన్ని పరిరక్షించాలని కోరుతూ స్థానిక యువత ఆదివారం ఆందోళన చేపట్టారు. ఆక్రమణ దారులకు కొంతమంది స్థానిక నాయకులు, మాజీ ఉక్కు ఉద్యోగులు కొమ్ముకాయడం సరికాదని ఆరోపించారు. ఈ సందర్భంగా నినాదాలు చేశారు. కార్యక్రమంలో గ్రామ యువత పుచ్చా మణిబాబు, మాదాసు రామకృష్ణ, పాముల వసంతరావు, మాదాసు గణేష్, బలిరెడ్డి వాసు, నీలపాటి రాజు, ఆకుల జనార్దన్, బలిరెడ్డి అప్పారావు, లుకలాపు లోకేష్ పాల్గొన్నారు.

రావణుడిపై రాముడి గెలుపే విజయదశమి

- హరేకృష్ణ మూవ్‌మెంట్ ప్రతినిధి అంబరీష దాస
- వైకుంఠ మందిర ప్రాంగణంలో 'రావణ దహనం'



వైకుంఠ మందిర ఆవరణలో హోమం నిర్వహిస్తున్న వేదపండితులు

తగరపువలస: త్రేతాయుగమున దశానన రావణునిపై శ్రీరామచంద్రుని విజయానికి సంకేతంగా విజయదశమి జరుపుకొంటారని హరేకృష్ణ మూవ్‌మెంట్ ప్రతినిధి అంబరీష దాస అన్నారు. ఇందుకు ప్రతీకగా ఉత్తరాది రాష్ట్రాలలో విజయదశమి నాడు 'రావణ వధ' నిర్వహిస్తారన్నారు. ఉత్తరాది రాష్ట్రాలలో వైభవంగా జరుపుకొనే ఈ ఉత్సవాన్ని మొదటిసారి విశాఖలో నిర్వహిస్తున్నామన్నారు. ఆనందపురం మండలం గంభీరం హరేకృష్ణ వైకుంఠ మందిర ప్రాంగణంలో విజయదశమి సందర్భంగా శనివారం సాయంత్రం హరేకృష్ణ మూవ్‌మెంట్ ఆధ్వర్యంలో 'రావణవధ' నిర్వహించారు. ఈ సందర్భంగా 20 అడుగుల ఎత్తు కలిగిన రావణుడి భారీ కటౌట్‌ను ప్రత్యేక బాణసంచాతో దహనం చేశారు. అంబరీష దాస మాట్లాడుతూ చెడుపై మంచి గెలుపే విజయదశమి అన్నారు.

క్షీణించిన పారిశుధ్యం



ముత్యాలమ్మపాలెం బీచ్‌రోడ్డులో కాలువను కమ్ముకున్న పిచ్చిమొక్కలు



పరవాడలో ప్రధాన కాలువలో పేరుకుపోయిన వ్యర్థాలు

- పల్లెల్లో పేరుకుపోతున్న చెత్త
- తుప్పలతో నిండిన డ్రైనేజీలు
- తరచూ ముసురుకుంటున్న వ్యాధులు
- గ్రామస్తుల అవస్థలు



ముత్యాలమ్మపాలెం-తంతడి రోడ్డులో పేరుకుపోయిన చెత్త



వాడచీపురుపల్లి సాయిబాబా ఆలయం వద్ద కుప్పలుగా పోసిన వ్యర్థాలు

పరవాడ: గ్రామీణ ప్రాంతాల్లో పారిశుధ్య నిర్వహణ అధ్వానంగా ఉంటోంది. దీంతో పల్లెవాసులు తరచూ అనారోగ్యంతో ఆస్పత్రుల పాలవుతున్నారు. క్షీణించిన పారిశుధ్య పరిస్థితులకు పరవాడ మండలంలోని ముత్యాలమ్మపాలెం, వాడచీపురుపల్లి, పరవాడ, తానాం తదితర గ్రామాలే నిదర్శనం.

మండల పరిధిలో ఏ గ్రామాన్ని చూసిన వ్యర్థాలు, చెత్త చెదారాలు పేరుకుపోయి దోమలు విజృంభించడంతో సీజనల్ వ్యాధులు ముసురుకుంటున్నాయి. అయినప్పటికీ అధికారులెవరూ పట్టించుకోవడం లేదని గ్రామస్తులు విమర్శిస్తున్నారు. గత ప్రభుత్వ హయాంలో పారిశుధ్య పరిస్థితులు మెరుగు పరిచేందుకు గ్రామ సర్పంచ్‌లు, పంచాయతీ కార్యదర్శులు, గ్రామ సచివాలయ సిబ్బంది గ్రామాల్లో పర్యటించి, పారిశుధ్య నిర్వహణపై ప్రత్యేక శ్రద్ధ తీసుకునేవారు. సీజనల్ వ్యాధులు ప్రబలకుండా జాగ్రత్తలు తీసుకునేవారు. కానీ కూటమి ప్రభుత్వంలో పరిస్థితులు అందుకు విరుద్ధంగా కనిపిస్తున్నాయి. గ్రామ సర్పంచ్‌లు ప్రభుత్వ ఆదేశాలకు అనుగుణంగా నడుచుకొనే పరిస్థితులు నెలకొనడంతో పారిశుధ్యం మరింత క్షీణిస్తోంది. దీంతో మలేరియా, టైఫాయిడ్, డయేరియా వంటి రోగాల బారిన పడుతున్న ప్రజలు ఆస్పత్రులకు క్యూ కడుతున్నారు.

పూడికలతో నిండిన కాలువలు

గత ప్రభుత్వ హయాంలో వర్షాకాలం వచ్చిందంటే సీజనల్ వ్యాధులు ప్రబలకుండా గ్రామాల్లోని కాలువల్లో పూడికలు తీయించి, శుభ్రం చేయించి ముందస్తు చర్యలు తీసుకునేవారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక పారిశుధ్య చర్యలను గాలికి వదిలేశారు. ఇటీవల కురిసిన వర్షాలకు కాలువల్లో పేరుకుపోయిన వ్యర్థాలు, చెత్త కారణంగా దోమలు పెరిగిపోయి ప్రజలు ఇబ్బంది పడుతున్నారు.

ముత్యాలమ్మపాలెంలో రోడ్డుపైకి మురుగు

ముత్యాలమ్మపాలెం గ్రామంలో మురుగునీరు ప్రవహించే ప్రధాన కాలువలో దట్టంగా పెరిగిన గడ్డి, చెత్తచెదారాలతో నిండి ఉండడం వలన మురుగు నీరు ప్రవహానికి ఆటంకాలు కలుగుతున్నాయి. గ్రామంలో పిల్ల కాలువలు శిథిలావస్థకు చేరి మురుగునీరు రోడ్లపై ప్రవహిస్తోందని గ్రామ మత్స్యకారులు తెలిపారు.

వాడచీపురుపల్లిలో తుప్పలతో నిండిన డ్రైనేజీలు

వాడచీపురుపల్లిలో ఎస్సీ, బీసీ కాలనీ, మెయిన్ రోడ్డు వెలుపల నుంచి ఏర్పాటు చేసిన డ్రైనేజీలు పిచ్చి మొక్కలు, చెత్త చెదారాలతో నిండిపోవడంతో మురుగు నీరు ప్రవహించడం లేదని స్థానికులు చెబుతున్నారు. అలాగే మెయిన్ రోడ్డు, సాయిబాబా ఆలయం, సామాజిక భవనం వద్ద చెత్త కుప్పలను ఎప్పటికప్పుడు తొలగించని కారణంగా దోమలు బెడదతో ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.

పరవాడలో దుర్గంధం భరించలేం

పరవాడలో మురుగునీరు ప్రవహించే ప్రధాన కాలువ వ్యర్థాలతో నిండి ఉండడం వలన దుర్వాసన వెదజల్లుతోంది. మెయిన్ రోడ్డు పక్క నుంచి ఏర్పాటు చేసిన కాలువలను పిచ్చి మొక్కలు, గడ్డి ఆక్రమించడం వలన మురుగు నీరు ప్రవహించడానికి అడ్డంకులు ఎదురవుతున్నాయి. కాలువల్లో పేరుకుపోతున్న పూడికల కారణంగా దోమల బెడద మరింత పెరుగుతోందని ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. పంచాయతీ అధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

తరచూ జ్వరాలే..



ముత్యాలమ్మపాలెంలో పూడికలతో నిండిన కాలువల కారణంగా మురుగు నీరు నిలిచిపోతోంది. దీంతో దోమలు పెరిగిపోయి, తరచూ విష జ్వరాల బారిన పడుతున్నాం. వీధి కాలువలకు మరమ్మతులు చేయాలి. బీచ్ రహదారిలో కాలువను అభివృద్ధి చేయాలి.

– కొవిరి పరదేశి, ముత్యాలమ్మపాలెం

దుర్గంధం భరించలేం



వాడచీపురుపల్లిలో బీసీ, ఎస్సీ కాలనీ వద్ద కాలువల్లో తుప్పలు తొలగించలేదు. దీంతో మురుగునీరు ఎక్కడికక్కడే నిలిచిపోతోంది. భరించలేని దుర్గంధంతో కాలనీవాసులందరం ఇబ్బంది పడుతున్నాం. అధికారులు స్పందించి.. పిచ్చి మొక్కలు, గడ్డితో నిండిన కాలువలను గుర్తించి వెంటనే తొలగించేలా చూడాలి.

– పోలారపు రాము, వాడచీపురుపల్లి

పారిశుధ్యం మెరుగుకు కృషి



గ్రామ పంచాయతీల్లో నెలకొన్న సమస్యలపై దృష్టి సారిస్తాను. ఇటీవలే ఈవోఆర్డీగా బాధ్యతలు తీసుకున్నాను. ఇంతవరకు పంచాయతీల సమస్యలు నా దృష్టికి రాలేదు. గ్రామాల్లో పారిశుధ్య పరిస్థితుల మెరుగుకు చర్యలు తీసుకుంటాం.

– కె.ధర్మారావు, ఈవోఆర్డీ, పరవాడ

ఉదాసీనంగా వ్యవహరిస్తే రాష్ట్రానికే ముప్పు



దీక్షా శిబిరంలో పాల్గొన్న కార్మిక సంఘ నాయకులు

అగనంపూడి: విశాఖ ఉక్కు కర్మాగార పరిరక్షణ విషయంలో కూటమి ప్రభుత్వ పెద్దలు ఉదాసీనంగా వ్యవహరిస్తే రాష్ట్రం భారీగా నష్టపోతుందని విశాఖ ఉక్కు పరిరక్షణ కమిటీ నాయకులు డి.ఆదినారాయణ, జె.అయోధ్యరామ్, వరసాల శ్రీనివాసరావు అన్నారు. ఉక్కు ప్రైవేటీకరణకు నిరసనగా ఉక్కు పరిరక్షణ, పోరాట కమిటీల ఆధ్వర్యంలో 1340వ రోజు రిలే దీక్షా శిబిరంలో వారు మాట్లాడారు. రాష్ట్రానికి ఆయువు పట్టువంటి విశాఖ ఉక్కును అమ్మేస్తే రాష్ట్రానికి వెన్నెముక విరిగినట్టే అన్నారు. దసరా పండగకు బోనస్ చెల్లించాల్సిన యాజమాన్యం కనీసం జీతాలు కూడా చెల్లించకుండా మానసికంగా వేధిస్తుందన్నారు. దేశంలో అన్ని ప్రభుత్వరంగ సంస్థల్లో బోనస్ చెల్లిస్తే, ఇక్కడ మాత్రం జీతం కూడా చెల్లించకుండా కావాలనే కార్మికులను, వారి కుటుంబ సభ్యులను వేధిస్తుందని ఆరోపించారు. కూటమి ప్రభుత్వం చిత్తశుద్ధితో ఉక్కు పరిరక్షణకు కృషి చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నాయకులు కామేశ్వరరావు, డేవిడ్, విల్లా రామ్మోహన్‌కుమార్, బాల భాస్కరరావు తదితరులు పాల్గొన్నారు.

జమ్మి చెట్లు పెంచాలి

సీతమ్మధార : ప్రజలంతా విధిగా జమ్మి చెట్లు నాటి పెంచాలని కృష్ణా యూనివర్సిటీ విశ్రాంత ఉపకులపతి డాక్టర్ సుంకరి రామకృష్ణారావు కోరారు. సీతమ్మధారలోని జీవీఎంసీ పార్కులో జమ్మిచెట్టు నాటిన తర్వాత ఆయన మాట్లాడారు. తులసి, ఉసిరి, మారేడు, వేప, మోదుగ, రావి, జమ్మి వంటి ఆయుర్వేద గుణాలు గల చెట్లను దేవతా వృక్షాలుగా భావించి పూజిస్తామని గుర్తు చేశారు. ఆయుర్వేద మందులలో జమ్మి చెట్టు ఆకులు, పువ్వులు, విత్తనాలు, చెట్టు బెరడు ఉపయోగిస్తారన్నారు. జమ్మి పసరు రాసుకుంటే కుష్టు వ్యాధి కూడా తగ్గుతుందని స్పష్టం చేశారు. అందుకే ఈ చెట్టుకి సురభి బంగారం అని పేరు వచ్చిందని గుర్తు చేశారు.

అప్పన్నకు విశేషంగా ఆర్జిత సేవలు



నిత్య కల్యాణంలో యజ్ఞోపవీతధారణ ఘట్టం నిర్వహిస్తున్న అర్చకుడు

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీ నృసింహస్వామికి ఆదివారం ఆర్జిత సేవలు విశేషంగా నిర్వహించారు. ఉదయం 7 గంటల నుంచి స్వర్ణ పుష్పార్చన ఘనంగా నిర్వహించారు. ఆలయ కల్యాణ మండపంలో వేదికపై స్వామి వారి ఉత్సవమూర్తులు గోవింద రాజస్వామి, శ్రీదేవి, భూదేవిలను వేంజేపచేశారు. విశ్వక్సేన పూజ, పుణ్యాహవచనం నిర్వహించారు. అనంతరం 108 స్వర్ణ సంపెంగ దళాలతో అష్టోత్తర శతనామావళి పూజ చేశారు. ఉభయదాతలకు స్వామి వారి ప్రసాదం, శేషవస్త్రాలు అందజేశారు. అర్చకులు సాతులూరి నరసింహాచార్యులు కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆలయ ఏఈవో ఆనంద్‌కుమార్ ఏర్పాట్లు పర్యవేక్షించారు.

వైభవంగా నిత్య కల్యాణం

శ్రీ వరాహ లక్ష్మీ నృసింహస్వామికి ఆదివారం నిత్య కల్యాణం వైభవంగా నిర్వహించారు. ఆలయ కల్యాణ మండపంలో వేదికపై స్వామి వారి ఉత్సవమూర్తులు గోవింద రాజస్వామి, శ్రీదేవి, భూదేవిలను వేంచేపజేసి ఉదయం 9.30 గంటల నుంచి కల్యాణం శాస్త్రోక్తంగా నిర్వహించారు. విశ్వక్సేన పూజ, పుణ్యాహవచనం, కంకణధారణ, యజ్ఞోపవీతం, జీలకర్ర బెల్లం, మాంగళ్యధారణ, తలంబ్రాలు తదితర ఘట్టాలతో కల్యాణాన్ని నిర్వహించారు. ఉభయదాతలకు స్వామి వారి అక్షింతలు, ప్రసాదం, శేషవస్త్రాలు అందజేశారు.

శాంతిభద్రతల పరిరక్షణకు కృషి



ఏఆర్ కార్యాలయంలో దుర్గాదేవికి పూజలు చేస్తున్న అనకాపల్లి ఎస్పీ దీపిక

ఆరిలోవ: శాంతిభద్రతల పరిరక్షణకు దృఢ సంకల్పంతో కృషి చేయాలని పోలీసులకు అనకాపల్లి జిల్లా ఎస్పీ ఎం.దీపిక సూచించారు. విజయదశమి సందర్భంగా శనివారం విశాలాక్షినగర్‌లోని ఆర్మ్‌డ్ రిజర్వ్‌డ్ పోలీస్ కార్యాలయంలో పోలీస్ అధికారులు ఆయుధ పూజ నిర్వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న ఆమె జిల్లా పోలీస్ అధికారులతో కలిసి దుర్గాదేవికి పూజలు చేశారు. అనంతరం సిబ్బంది వారు ఉపయోగించే ఆయుధాలు, వాహనాలకు పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్పీ దీపిక మాట్లాడుతూ సిబ్బందికి విజయదశమి శుభాకాంక్షలు తెలిపారు. విధి నిర్వహణలో పోలీసులు నిరంతరం కష్టపడుతున్నారన్నారు. పోలీస్ సిబ్బంది, వారి కుటుంబ సభ్యులు ఆనందంగా, ఆరోగ్యంగా ఉండాలని ఆకాంక్షించారు. పోలీస్ వ్యవస్థలో ఆయుధాలు ఒక భాగన్నామని, వాటిని అందరూ గౌరవించాలని కోరారు. బాధ్యతాయుతంగా విధులు నిర్వహించాలని సూచించారు. కార్యక్రమంలో అదనపు ఎస్పీలు ఎం.దేవప్రసాద్, వి.సత్తిరాజు, డీఎస్పీ పి.నాగేశ్వరరావు, సీఐలు బాలసూర్యారావు, సతీష్, మన్మధరావు, నర్సింహమూర్తి, ఎస్ఐలు నాయుడు, ఆదినారాయణ, సిబ్బంది పాల్గొన్నారు.

ఘనంగా ముగిసిన శరన్నవరాత్రి ఉత్సవాలు



కామేశ్వరి పీఠంలో శ్రీనివాస కల్యాణంలో పాల్గొన్న భక్తులు



విజయ దశమి సందర్భంగా జమ్మి చెట్టుకు పూజలు చేస్తున్న స్వామీజీలు



దేవీపురంలో దుర్గాదేవిగా సహస్రాక్షి అమ్మవారు



పంచముఖ గాయత్రి మందిరంలో అమ్మవారికి చీరలతో అర్చన



ఎస్ఆర్ పురంలో పూజలు అందుకున్న కనకదుర్గమ్మ

పెందుర్తి : దేవి శరన్నవరాత్రి ఉత్సవాలు పెందుర్తి ప్రాంతంలో శనివారం ఘనంగా ముగిశాయి. చినముషిడివాడ సమీపంలోని సప్తగిరినగర్‌లోని అలివేలు మంగమ్మ సన్నిధిలో అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. అమ్మవారు చందనాలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. పేదలకు ఉచితంగా చీరలు పంపిణీ చేశారు. శ్రమశక్తినగర్‌లోని పంచముఖ గాయత్రి మందిరంలో అమ్మవారికి విశేష అభిషేకాలు చేశారు. ధర్మకర్త సరస్వతుల రామారావు దంపతులు, ఆలయ కమిటీ ప్రతినిధులు, అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు. పెందుర్తిలోని జ్యోతిర్లింగ సహిత మహాకామేశ్వరి ఆలయంలో అమ్మవారు రాజరాజేశ్వరీ మాతగా పూజలందుకున్నారు. కుంకుమ పూజలు జరిపారు. చినముషిడివాడలోని శారదాపీఠంలో విజయదశమిని పురస్కరించుకుని అమ్మవారికి పీఠాధిపతి స్వరూపానందేంద్ర సరస్వతి స్వామీజీ, ఉత్తరాధికారి స్వాత్మానందేంద్ర సరస్వతి ప్రత్యేక పూజలు జరిపారు. పీఠం ప్రాంగణంలో ఆయుధ పూజ, వాహన పూజలు జరిపారు. జమ్మి చెట్టుకు ప్రత్యేక పూజలు చేశారు. సాధుమఠం సమీపంలోని మహాకామేశ్వరి పీఠంలో శరన్నవరాత్రి ఉత్సవాలు ఘనంగా ముగిశాయి. అమ్మవారికి విశేష పూజలు జరిపారు. శ్రీనివాస కల్యాణం శాస్త్రోక్తంగా నిర్వహించారు.

దేవీపురంలో బ్రహ్మోత్సవాల ముగింపు

సబ్బవరం : ప్రముఖ ఆధ్యాత్మిక కేంద్రం దేవీపురంలో సహస్రాక్షి రాజరాజేశ్వరీదేవి ఆరాధనా పీఠంలో నిర్వహిస్తున్న దసరా బ్రహ్మోత్సవాలు శనివారంతో ముగిశాయి. సహస్రాక్షి రాజరాజేశ్వరీదేవి మహిషాసుర మర్దినిగా దుర్గాదేవి అలంకరణలో భక్తులకు శనివారం దర్శనమిచ్చారు. సాయంత్రం మహా కామేశ్వరుడు, కామేశ్వరి, కార్యసిద్ధి గణపతి, దేవతా ఉత్సవమూర్తులను ప్రత్యేకంగా అలంకరించారు. అనంతరం పురవీధుల్లో ఊరేగింపు నిర్వహించారు. మంగళ వాయిద్యాలు, కోలాట నృత్యాల మధ్య రథయాత్ర నిర్వహించారు. అమ్మవారి సన్నిధిలో లలితా నవావరణ హోమం నిర్వహించారు.

సింహాచలం : అడవివరంలోని హవేళీ ప్రాంగణంలో శ్రీ వరాహలక్ష్మీ నృసింహ ఫ్రెండ్స్ యూనియన్ ఆధ్వర్యంలో దుర్గాదేవి నవరాత్రి మహోత్సవాలు శనివారంతో ఘనంగా ముగిశాయి. అమ్మవారు రాజరాజేశ్వరిదేవి అలంకారంలో దర్శనమిచ్చారు. అమ్మవారిని పెద్ద సంఖ్యలో భక్తులు దర్శించుకున్నారు. రాత్రి అనుపోత్సవం వైభవంగా నిర్వహించారు. 98వ వార్డు కార్పొరేటర్ పి.వి.నరసింహం, దేవస్థానం మాజీ ట్రస్ట్ బోర్డు సభ్యుడు గంట్ల శ్రీనుబాబు, యూనియన్ సభ్యులు ఫణిమనోహర్, బొట్టా శ్రీను, సతివాడ శంకర్‌రావు, రౌతు రాంబాబు, అవినాష్, ఎస్.అప్పారావు, సింహాచలం మాస్టార్, బంటుబిల్లి మహేష్ తదితరులు అమ్మవారిని దర్శించుకున్నారు. గంట్ల శ్రీనుబాబు రూ.51,500 విరాళం అందజేశారు.

అట్టహాసంగా బతుకమ్మ సంబరాలు



బతుకమ్మ వేడుకల్లో తెలంగాణ మహిళలు



వేడుకల్లో పాల్గొన్న స్టీల్‌ప్లాంట్ సీజీఎం శ్రీధర్

ఉక్కునగరం: తెలంగాణకు చెందిన ఉక్కు ఉద్యోగులు, వారి కుటుంబ సభ్యులు బతుకమ్మ సంబరాలను అట్టహాసంగా నిర్వహించారు. దసరా సందర్భంగా జరిగిన సంబరాల్లో తెలంగాణ ఉద్యోగులు తమ కుటుంబ సభ్యులతో ఉత్సాహంగా గడిపారు. మహిళలు, పిల్లలు ఆటపాటలతో అలరించారు. ఈ సందర్భంగా స్టీల్‌ప్లాంట్ తెలంగాణ ఉద్యోగుల సంక్షేమ సంఘం అధ్యక్ష, ప్రధానకార్యదర్శులు ఎన్. కుమారస్వామి, జి. ఆనంద్ మాట్లాడుతూ ఏటా బతుకమ్మ సంబరాలు జరుపుతున్నామన్నారు. సద్దుల బతుకమ్మతో సంబరాలు ముగిశాయన్నారు. కార్యక్రమంలో స్టీల్‌ప్లాంట్ సీజీఎం (వర్క్స్) యు. శ్రీధర్, జనరల్ మేనేజర్లు రవశేఖర్, డాక్టర్ ఎ.పి. నవీన్‌కుమార్, ఎస్. వీరేశం, ఆచారి, ఎ. మురళీధరరెడ్డి, కె.వి.డి. ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

సంప్రదాయాల పరిరక్షణ ముఖ్యం

తాటిచెట్లపాలెం : భారతీయ సంస్కృతి పరిరక్షణకు సనాతన సాంప్రదాయాన్ని పాటించడమే ముఖ్యమని జగద్గురుపీఠం గౌరవ అధ్యక్షుడు డాక్టర్ కేఎస్ శాస్త్రి తెలిపారు. తాటిచెట్లపాలెంలో గల మాస్టర్ హోమియో వైద్యాలయంలో దుర్గాదేవి పూజా మహోత్సవాల ముగింపు కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మాస్టర్ ఎక్కిరాల కృష్ణమాచార్య (మాస్టర్ ఇ.కె.) వద్ద తాము పొందిన ప్రేరణతో వేద సూక్తాలను నేర్పిస్తున్నామన్నారు. జగద్గురుపీఠం డైరెక్టర్ చింతలపాటి సత్యదేవ్ మాట్లాడుతూ గత 50 సంవత్సరాలుగా ఉచిత హోమియో వైద్యసేవలను ఒక తపస్సుగా నిర్వహిస్తున్న ఆదర్శనీయులు డాక్టర్ కేఎస్ శాస్త్రి అని కొనియాడారు. అనంతరం డాక్టర్ కేఎస్ శాస్త్రి 120 మంది పేద మహిళలకు చీరలు బహూకరించారు. కార్యక్రమంలో మద్దూరి హనుమంతరావు, సీహెచ్ నరసింహమూర్తి, కె.శ్రీనివాస్ పాల్గొన్నారు.

కేంద్ర ప్రభుత్వ వైఖరి వల్లే సాయిబాబా మరణం



సాయిబాబాకు నివాళులర్పిస్తున్న ప్రజాసంఘాల నేతలు

సీతమ్మధార: కేంద్ర ప్రభుత్వం సాగించిన హింస వల్లనే ప్రొఫెసర్ జీఎన్ సాయిబాబా మరణించారని విశాఖ పౌర ప్రజా సంఘాల నేతలు ఆరోపించారు. ఈ మేరకు ఆశీలమెట్ట జీవీఎంసీ గాంధీ పార్కులో ఆదివారం జరిగిన సాయిబాబా సంతాప సభలో పలువురు వక్తలు మాట్లాడారు. ఢిల్లీ యూనివర్సిటీ పూర్వ ప్రొఫెసర్ న్యాయమైన, నూతన సమాజం కోసం అలుపెరుగని పోరాటం చేసిన యోధుడని వారు కొనియాడారు. సుదీర్ఘమైన జైలు జీవితం వల్లనే ఆయన ఆరోగ్యం పాడైందని ఆందోళన వ్యక్తం చేశారు. ఆయన 90 శాతం దివ్యాంగుడు అయినా సరే బెయిల్ ఇవ్వకపోవడం అన్యాయమన్నారు. హైదరాబాద్ నిమ్స్‌లో శనివారం సాయిబాబా మరణంతో ప్రజలు నిజమైన పోరాట యోధుడిని కోల్పోయారని విచారం వ్యక్తం చేశారు. ఆయన మరణానికి కేంద్రమే బాధ్యత వహించాలని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో విశాఖ మార్క్సిస్ట్ అధ్యయన కేంద్రం కన్వీనర్ జేవీ సత్యనారాయణమూర్తి, ఐప్వ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఎం.వెంకటేశ్వర్లు, టి.శ్రీరామమూర్తి, బూసి వెంకటరావు, ఎస్.వెంకటలక్ష్మి, ఏడుకొండలు, కేఎస్ చలం, ఎం.పైడిరాజు, జీడీ సారయ్య, రాజు, ఎన్.నాగభూషణరావు, వామనమూర్తి, వి.నల్లయ్య, ఎస్.ఆదినారాయణ తదితరులు మాట్లాడారు.

ఐవీఎల్ శాస్త్రి పేరిట తపాలా స్టాంప్ విడుదల



తపాలా స్టాంప్ విడుదల చేస్తున్న జనకులం ప్రతినిధులు

సీతమ్మధార : సంగీత జనకులం వ్యవస్థాపకుడు ఐ.వి.ఎల్.శాస్త్రి పేరిట రూ.5 విలువ గల తపాలా స్టాంపుని కేంద్ర ప్రభుత్వం ముద్రించడం సంతోషకరమని ఆదాయ పన్ను శాఖ అధికారి వి.నాగ సూర్యారావు అన్నారు. విజయదశమి సందర్భంగా సీతమ్మధారలో శనివారం నిర్వహించిన సంగీతసభలో ఆయన మాట్లాడుతూ ఐ.వి.ఎల్.శాస్త్రి సంగీత ప్రపంచానికి చేసిన సేవలు మరువలేనివన్నారు. కులపతి బుక్ ట్రస్ట్ కార్యదర్శి చింతలపాటి సత్యదేవ్ మాట్లాడుతూ 20 వేల మందికి శాస్త్రీయ సంగీతంలో ఉచిత శిక్షణ ఇచ్చారని కొనియాడారు. సంస్థ అధ్యక్షుడు ఇంద్రగంటి కాశీప్రసాద్ మాట్లాడుతూ తమ తండ్రి చూపిన మార్గంలో సంగీత జనకులం సంస్థ కృషి చేస్తుందని స్పష్టం చేశారు. అనంతరం వారు స్టాంపు విడుదల చేసి ప్రదర్శించారు. కార్యక్రమంలో డాక్టర్ బి.విజయప్రసాద్, సీహెచ్.గిరిధర్, సంగీత గురువులు ఐ.రమణిప్రసాద్, ఎస్.లక్ష్మి, శైలేష్ పాల్గొన్నారు.